విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 2, సెప్టెంబరు 2025

రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి..

సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-యాడికి (పెద్దవడుగూరు) : మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం, సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం రైతుల కోరికల దినోత్సవం సందర్భంగా గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్, మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలపైన పూర్తిగా దృష్టి పెట్టి రైతన్న డిమాండ్లను తక్షణమే అమలు చేయాలన్నారు. టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ లు ప్రతి రైతుకు 20 వేల రూపాయలు సాగు సాయం తక్షణమే ఇవ్వాలని పంటలు నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందించి ప్రభుత్వాలు ఆదుకోవాలని అన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టేలా చట్టాలు రూపొందించాలని ఏపీ రైతు సంఘం ద్వారా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ, పట్టణ కార్యదర్శి రంగనాయకులు, పోలా రంగస్వామి హుస్సేన్ పీరా రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఆదినారాయణ యాదవ్, సంజన,పెద్ద నాగేంద్ర, మల్లికార్జున సుధాకర్ గౌడ్, రఘురామయ్య, పవన్ కుమార్ రెడ్డి వీరాంజనేయులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ అధ్యక్షతన రైతుల కోరికల దినోత్సవం సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు ఓబిరెడ్డి చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని, ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలవైపు మళ్లుతున్నారని, ఏటా సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతున్నది కావున కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్ చట్టం 2022ను ఉపసంహరించాలని, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను రద్దు చేయాలి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ లు ప్రతి రైతుకు 20 వేల రూపాయలు సాగు సాయం వెంటనే అందించాలని, పంటలు నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందించాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు, అమ్మే వ్యాపారు లపై కఠిన చర్యలు చేపట్టేలా చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నీలూరు లక్ష్మయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సిపిఐ పట్టణ కార్యదర్శి కుల్లాయిరెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి ఆదినారాయణ యాదవ్, సీపీఐ నాయకులు నబి రసూల్, గరిడీ శివన్న రామ సుబ్బారెడ్డి, సురేష్ వెంకట రమణయ్య, మాబు పీరా, రమేష్ పాల్గొన్నారు.

పత్తి దిగుమతిపై సుంకం తగ్గింపు జీవో ఉపసంహరించుకోవాలి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్

విశాలాంధ్ర-శింగనమల: సెప్టెంబర్ 1న రైతాంగ కోర్కెల దినం సంధర్భంగా శింగనమల మండల కేంద్రములో ఏపి రైతుసంఘం అధ్వర్యంలో ఏపీ రైతు సంఘం జెండాను జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగారైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని, పాలకులు అధికారంలోకి రాకముందు రైతులకు మాయమాటలు చెప్పి, రైతే రాజు రైతు లేనిదే రాజ్యం లేదని,ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన మాటలన్ని నీటి మూటలుగా మారుతున్నాయన్నారు. రైతులు ప్రతిసంవత్సరం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల వైపు మల్లుతున్నారని, ప్రతి సంవత్సరం సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతున్నదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యల పైన దృష్టి సారించి రైతు డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు చేనేత మధు,చికెన్ బాషా,రైతుసంఘం మండల అధ్యక్షులు బయన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మునిస్వామి, రైతుసంఘం నాయకులు, బండి వెంకట రాముడు, రామసుబ్బారెడ్డి, నారప్ప, ముత్యాలు రూప్లానాయక్, శ్రీనివాసులు, రామాంజినేయులు, రామక్రిష్ణ, ఆదినారాయణ, అజయ్, తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు గాంధీ చిత్రపటం అందజేత

విశాలాంధ్ర-యాడికి: జర్మన్ కాన్వాస్‌పై చిత్రించిన గాంధీ చిత్రపటాన్ని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్ సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కి బహూకరించారు. చీరాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రవి గీసిన గాంధీ అపురూప చిత్రపటాన్ని గుత్తి కోట పరిపాలకులు మురారి రావ్ గోర్పడే వారి వంశస్థులు శ్రీ ఇంద్రజిత్ గోర్పడే ముద్రించిన, ప్రముఖ నవలా రచయిత్రి రీటా రామ్మూర్తి గుప్త గుత్తి కోటను పాలించిన వంశస్తులపై వ్రాసిన పుస్తకాన్ని, అనంతపురం కలెక్టర్ కార్యాలయంకు అందించడం ఆనందంగా ఉన్నదని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు శ్రీ చౌదరి విజయభాస్కర్ తెలిపారు. గుత్తి కోట వైభవాన్ని తిరిగి పునరుద్ధరించటంలో కలెక్టర్ వినోద్‌కుమారు ఎంతగానో సహకరిస్తున్నారని గుత్తి కోట సంరక్షణ తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి జయకుమార్, సమితి గౌరవ సలహాదారు యు.బాలమురళీకృష్ణ, సాంస్కృతిక విభాగం సాధు శేఖర్, స్వాతంత్ర్య పోరాటయోధులు కుటుంబ సభ్యుడు సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, సభ్యులు రంగస్వామి, వీరేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కలు, కోతుల, పశువుల నుంచి ప్రజలను కాపాడండి

విశాలాంధ్ర- ఉరవకొండ : ప్రజలను వేధిస్తున్న వీధి కుక్కలు, కోతులు, రోడ్లపై తిరిగే పశువుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ఉరవకొండ పట్టణానికి ఎంపీటీసీ సభ్యులు వన్నూరు సాహెబ్ తెలిపారు. సోమవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఫిర్యాదుల కార్యక్రమానికి ఎంపిటిసి సభ్యులు ఫ్లే కార్డు పట్టుకుని వచ్చి నిరసన తెలిపారు. అనంతరం తాసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కుక్కలకు జడిసి చిన్న పిల్లలు బడికి వెళ్లడానికి జంకుతున్నారని, ఇంటి ముందు సేద తీరుతున్న వృద్ధులకు, పిల్లలకు వీధి కుక్కలు ప్రమాదకరంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో టూ వీలర్ పై వెళ్లే వారిని వెంటబడి కరుస్తున్నాయని.. వాటి నుంచి తప్పించుకోవడానికి వెళ్లి ప్రమాదాలకు కూడా గురవుతున్నారని తెలిపారు. వెంటనే అరికట్టాలన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-నార్పల : మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన షేక్ జమీలపై కొడవలితో దాడి చేసిన హత్యయత్నం కేసులో నిందితుడు దుబ్బా లక్ష్మిరెడ్డిని సోమవారం అరెస్టు చేశారు.వివాహేతర సంబంధం కొనసాగుతుందని, అనుమానంతో ఆగ్రహానికి లోనైన లక్ష్మిరెడ్డి, తోటలో కూలీ పనికి వెళ్లి పనిచేస్తున్న జెమీలియాపై ఒక్కసారిగా దాడి చేశాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-పామిడి : వ్యాపార నిమిత్తం బెంగళూరుకు వెళ్లి తిరిగి అనంతపురంలోని స్వగృహంకు 44వ జాతీయ రహదారిపై వస్తుండగా మార్గ మధ్యలో తన కారు టైరు పగిలి అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో యువ వ్యాపారవేత్త అంజన కుమార్ (34)కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. ఆదివారం వ్యాపార నిమిత్తం బెంగుళూరు సిటీకి వెళ్లి తన కారులో తనే డ్రైవింగ్ చేసుకుంటూ అనంతపురంకు వస్తూ ఉండగా పెనుగొండ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమారుడు రూపేష్ ఉన్నారు. సోమవారం సొరకాయలపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

మధు సాయి విత్తన షాపు తనిఖీ

విశాలాంధ్ర-తాడిపత్రి : పట్టణంలోని మధు సాయి ట్రేడర్స్ విత్తనాల షాపును సోమవారం ఏడిఏ రవి ఇన్చార్జి ఏవో మహిత కిరణ్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ మధు సాయి ట్రేడర్స్ షాప్‌లో కొన్ని మొక్కజొన్న హైబ్రిడ్ రకాలను కడప జిల్లాకు చెందిన రైతులు కొనుగోలు చేశామని, మొక్కజొన్న హైబ్రిడ్ రకంను పొలంలో వేశామని 90 రోజులు కావస్తున్న మొక్కజొన్న కంకి అక్కడక్కడ మాత్రమే వచ్చాయని మాకు నాసిరకం మొక్కజొన్న విత్తనాలు షాప్ యజమాని అమ్మాడని తెలిపారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు స్టాకును అమ్ముటకు వీలుకాకుండా నిలిపేశామన్నారు. పూర్తిగా విచారించిన తర్వాత కంపెనీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేషన్ షాపుల్లో బియ్యం తక్కువ తూకాలపై చర్యలు తీసుకోండి

సీపీఐ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-యాడికి: రేషన్ షాపుల్లో బియ్యం తక్కువ తూకాలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ ప్రతాపరెడ్డి కి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జూటూరు మహమ్మద్ రఫీ, వెంకటరాముడు యాదవ్, మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు రేషన్ దుకాణాలలో డీలర్లు ఇష్టానుసారంగా బియ్యం తక్కువ తూకాలు వేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని కొందరి రేషన్ కార్డు పై 15 కేజీలు బియ్యం వేయాల్సి ఉండగా 12 కేజీలే వేయడం జరుగుతున్నదని, ఇలా ప్రతి రేషన్ కార్డు పై మూడు కేజీలు బియ్యం తక్కువ తూకం వేస్తూ ప్రజలను మోసం చేస్తుండడంతో ఈ విషయమై రేషన్ కార్డుదారులు డీలర్లను ప్రజలు అడగగా మాకు ప్రభుత్వ అధికారుల నుండి బియ్యం తక్కువగా సరఫరా చేస్తున్నారని కావున బియ్యం తక్కువ వేయవలసి వస్తుందని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కందిబేళ్లు. జొన్నలు,ప్రతి నెల కాకుండా మూడు నెలలకు నాలుగు నెలలకు ఒకసారి ఇస్తున్నారన్నారు. అదేవిధంగా జొన్నలు కేజీ తూకంతో కాకుండా డబ్బాతో కొలిచి వేస్తున్నారని ఈ విధంగా డబ్బాతో కొలిచి వేయడం వలన కిలో జొన్నలకి బదులు 800 గ్రాములు జొన్నలు వస్తున్నాయన్నారు. ఇటువంటి మోసపూరిత డీలర్ల పై చర్యలు తీసుకొని నిరుపేదలకు నిత్యవసర సరుకులు సక్రమంగా అందేటట్టు చూడాలని తహసిల్దార్ ప్రతాపరెడ్డి ని సిపిఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఓబిరెడ్డి సిపిఐ మండల సహాయ కార్యదర్శివడ్డే రాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సిపిఐ పట్టణ కార్యదర్శి కుళాయి రెడ్డి, సీపీఐ నాయకులు గరిడి శివన్న, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఆదినారాయణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలి..

సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య

విశాలాంధ్ర-శింగనమల : పుట్లూరు మండలం తక్కళ్లపల్లి సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి, బాలు అధ్యక్షతన సోమవారం గ్రామ సచివాలయం వద్ద ఎస్సీ కాలనీలో సైడ్ కాల్వలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల సీపీఐ కార్యదర్శి డి.,పెద్దయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీ కాలనిలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ కార్యదర్శి ఏమాత్రం స్పందించలేదని.. అధికారులకు ఎందుకంత చిన్నచూపని నిలదీశారు. కాలనీలోని తూర్పు పాల్యం పడమటి పాల్యంలో సైడ్ కాలువలు లేక చిన్నపాటి వర్షం వచ్చిన వర్షపు నీరు కుంటల వలే కాలనీలో నిలిచిపోతున్నదని, వర్షాకాలంలో దోమ కాటు వల్ల సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని, తక్షణమే కాలువలు ఏర్పాటు చేసి మురికి నీరు నిలబడకుండా చేయాలని డిమాండ్ చేశారు. ట్యాంకు పక్కలో ఉన్న బోరు మరమ్మత్తులు చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకుల ద్వారా నీరందించాలన్నారు. కాలనీ వ్యాప్తంగా వీధిలైట్లు లేక చీకటి పడిందంటే కాలనీవాసులు బయటికి రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని, కాలనీ వ్యాప్తంగా కంపచెట్లు ఏపుగా పెరిగి ఆ కంపచెట్ల నిండా విషపురుగులు, పాములు తిరుగుతున్నాయని, తక్షణమే వీధిలైట్లు బిగించి కంప చెట్లు తొలగించి శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటశివ, ఓ.,ఓబులపతి, నడిపి నారాయణ, వెంకటేష్, పాండు, నాగరాజు, ప్రభాకర్, నారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవ్వ తాతలకు ఆసరా ఎన్టీఆర్ భరోసా పెన్షన్

ఎమ్మెల్యే బండారు శ్రావణి

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ డబ్బులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, పింఛన్ల ను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,దేశంలోనే పింఛన్ల సంక్షేమ పథకానికి ఆద్యులు టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని, దశాబ్దాల క్రితమే పేదలకు ఆర్థికంగా ఆదుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పింఛన్లను రూ.200 నుంచి రూ.2000 కు, రూ.3000 నుండి రూ.4000 కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు కే దక్కుతుందని, గత వైసీపీ ప్రభుత్వంలో నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగ పెన్షన్లు పొందారని, అలాంటి పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే కొన్ని కారణాలతో వెరిఫికేషన్లో అర్హులకు కూడా నోటీసులు రావడం బాధాకరమని, ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అర్హులైన ఏ ఒక్కరికి అన్యాయం జరగదని, అర్హులైన అందరికీ దివ్యాంగ పింఛన్ ఇవ్వాలని ఆదేశించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అర్హులైన వారందరికీ పింఛన్ల డబ్బులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల పేర్లు ఆన్‌లైన్‌లో తొలగించాలి..

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో టిడ్కో ఇళ్ల ఆన్లైన్లో లబ్ధిదారులకు వచ్చినట్టు చూపిస్తూ ఉంది కానీ వారికి ఇల్లు మంజూరు కాలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరభద్ర స్వామి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మార్వో రమాదేవికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు ఎం.వీరభద్రస్వామి. పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ మాట్లాడుతూ జగనన్న ప్లాట్ లబ్ధిదారుల అనుమతితో నోటీసులు ఇవ్వాలని గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నపుడు పట్టణంలో దాదాపుగా 2 వేల పైబడి ఇంటి స్థలాలు ఇచ్చారని వాటిలో కొంతమంది లబ్ధిదారులకు రద్దు చేయడం జరిగిందని. రద్దైన లబ్ధిదారులు ఇంటిస్థలం కొరకు ఆన్లైన్‌లో చేసు కోవడానికి పోతే ఆన్‌లైన్‌లో మీకు ఇంటి స్థలం వున్నదని చూపిస్తున్నదని అన్నారు. ఇప్పటికైనా ఆ సమస్య పరిష్కారం చేయాలని అన్నారు. వీఆర్వోల ద్వారా జగనన్న పాట్ల నిర్మాణం చేసుకోని వారికి నోటీసులు ద్వారా రద్దు చేస్తామని చెప్పడం బాధాకరం అన్నారు. గుంతకల్లు పట్టణంలో 6000ల పైబడి జగనన్న పాట్లు ఇచ్చారని, ఇందులో ఆన్‌లైన్‌లో చూపిస్తున్న లబ్ధిదారుల గతంలో మాదిరిగా అర్హులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు కే దేవేంద్ర, ఈశ్వరయ్య, వెంకట్ నాయక్, ఉమర్ భాష, ఏఎస్ఎఫ్ నాయకులు ఫర్జన తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్‌కు జీతాలు, ఈపీఎఫ్‌లు చెల్లించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ మీటర్లుగా పని చేస్తున్నటువంటి వారికి జీతాలు ,ఈపిఎఫ్ , ఈఎస్ఐ లు ఇవ్వాలని సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రీడర్ మీటర్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఏపిడికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఏఐటీయూసీ పట్టణ సెక్రెటరీ ఈశ్వరయ్య ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రీడర్ మీటర్స్ కమిటీ కార్యదర్శి షేక్ హాజరత్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల ఆగస్టు 27న పండగని చూడకుండా మీటర్ రీడర్ కు జీతాలు ఇవ్వలేదని అన్నారు. అలాగే నవంబర్ 2024 చెల్లించవలసిన అమౌంట్ చెల్లించలేదని 2025 ఏప్రిల్ వరకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఈఏఎన్ ఐసిఆర్ కన్స్ట్రక్షన్ ద్వారా చెల్లించవలసి ఉండగా ఇంతవరకు ఇవ్వలేదని మండిపడ్డారు. సూపరింటెండెంట్ ఎగ్జిక్యూటివ్, ఇంజనీర్ల ఆఫీసుల ముందు ధర్నా చేసినప్పుడు మీకు కచ్చితంగా న్యాయం చేస్తామని చెప్పారు కానీ నెలలు గడుస్తున్నా ఇంతవరకు జీతాలు గాని ఈఎస్ఐ, ఈపీఎఫ్ వచ్చే విధంగా చేయలేదని అన్నారు. ఈ సమస్యలపై అధికారులు స్పందించి ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, శివారెడ్డి, కిరణ్ కుమార్, నాగబాబు, పవన్ కుమార్, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర-అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ పట్ల విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు ఆగస్టు 26న విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలలో మొదటి బహుమతి సాధించిన తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని డి. గౌసియాను కలెక్టర్ వి.వినోద్ కుమార్ సోమవారం రెవెన్యూ భవన్ లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం విద్యార్థిని అభినందించారు. ముంబయిలో జరగనున్న జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ , డీఆర్ఓ మలోలా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఈ.బి. దేవి, జిల్లా లెప్రసి, ఎయిడ్స్ క్షయ నియంత్రణ అధికారి డా. అనుపమ జేమ్స్, ఆర్ఐఓ వెంకట రమణ నాయక్, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నారాయణ, నోడల్ అధికారి రాజేష్ చౌదరి, సూపర్ వైజర్ రమణ, సిబ్బంది మురళి, రిడ్స్ సిబ్బంది నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సుజావుగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ పలు వివరాలను ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు ప్రతినెలా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లను పంపిణీ చేస్తున్నారా, ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్ డబ్బు సరిపోతుందా, మీకు ఉపయోగపడుతోందా, ఎందుకు ఉపయోగించుకుంటున్నారు, ఇందులో పొదుపు ఏమైనా చేస్తున్నారా.. సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ సుజావుగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మొత్తం 2,80,471 పెన్షన్లు ఉన్నాయని, పెన్షన్ల కోసం 123 కోట్ల 86 లక్షల రూపాయలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. పెన్షన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.గంగాధర్ రెడ్డి, డీఆర్డీఏ పిడి శైలజ, డిపిఓ నాగరాజు నాయుడు, జెడ్పి సీఈవో శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషా, ఎంపీడీఓ దివాకర్, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అసంబద్ధ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

... ఎస్‌టియు డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జిల్లాలోని ఏపి మోడల్ స్కూల్స్ లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేనిచోట తాత్కాలిక పని సర్దుబాటు పేరుతో సమీప మోడల్ స్కూల్స్ నందు పనిచేస్తున్న ఉపాధ్యాయులను వారంలో మూడు రోజులు ప్రస్తుత పని చేస్తున్న పాఠశాలల్లో మరో మూడు రోజులు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పనిచేయాలనే ఆదేశాలను వెంటనే విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమణరెడ్డి, ఎస్.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏపిఎంఎస్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, రాష్ట్ర కౌన్సెల్లర్లు యాదవమూర్తి, బాలి రెడ్డిలు జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబును సోమవారం కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణరెడ్డి మాట్లాడుతూ మెగా డీఎస్‌ఈ 2025లో పీజీటీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ పోస్టులను నోటిఫై చెయ్యలేదని ఖాళీగా ఉన్న పోస్టుల్లోకి కొత్త టీచర్లు వచ్చే అవకాశం లేదని తెలిపారు. ఈ డిప్యుటేషన్ తాత్కాలికం కాదని రానున్న ఎస్ఎస్‌సి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల దృష్ట్యా ఈ మూడు రోజుల డిప్యుటేషన్ వలన విద్యార్థులకు జరిగే మంచికన్నా రెండు పాఠశాలల్లో ఉత్తీర్ణత దెబ్బతినే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఖాళీగా ఉన్న ఆయా సబ్జెక్టు పోస్టుల్లో గెస్ట్ లేదా ఒప్పంద ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చెయ్యాలన్నారు. ఈ డిప్యుటేషన్ 10 నుండి 50 కి. మీ పరిధిలో ఉన్న పాఠశాలలకు వెళ్లి బోధించాల్సి ఉంటుందని అటు మూడు రోజులు ఇటు మూడు రోజులు పాఠశాలలు తిరగడం మూలంగా ఎవ్వరికీ న్యాయం జరిగే పరిస్థితి ఉండదని డిప్యుటేషన్ వెంటనే ఉపసంహరించు కోవాలని ఎస్టియు డిమాండు చేస్తుందని లేకుంటే భవిష్యత్తులో ఆందోళనలకు దిగుతామనమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మోడల్ స్కూల్స్ లో పనిచేస్తున్న పలు ఉపాధ్యాయులు రాజా రెడ్డి, మోహన్, మధుసూదన్, నాగరాజు ఉపాధ్యాయిని రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ పఠనం..

విశాలాంధ్ర-ఉరవకొండ : స్థానిక ఆసార్ మకాన్ వద్ద మహ్మద్ ప్రవక్త 1500వ జన్మదినంను పురస్కరించుకొని సోమవారం సయ్యద్ ఆజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్బాబాల అధ్వర్యంలో మిలాద్ పఠనం సాగింది. మహ్మద్ ప్రవక్త సూక్తులతో పాటు నాతఖ్వానీల్లో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 5న జరిగే మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మిలాద్ ఉన్ నబీ జెండా ఊరేగింపు జరుగుతుందన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు...

విశాలాంధ్ర-కణేకల్లు : ఎరుగుంట గ్రామం సమీపం లో కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు, సోమవారం సాయంత్రం బైక్‌పైన బొమ్మనహాల్ మండలం ఏలంజి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు బైక్‌పైన వెళుతున్న సందర్భంలో కారు బళ్లారి వైపు నుంచి కనేకల్ క్రాస్‌వైపు వస్తుండగా ఢీకొంది. ఢీకొన్న వెంటనే బైకుపై ఉన్న ఇద్దరు అన్నదమ్ములు తీవ్రంగా గాయ పడినట్లు,ఎలంజి గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఇద్దరిని ఆసు పత్రికి తరలించినట్లు సంఘటనలో ఉన్న సూరి కాని స్టేబుల్ తెలిపారు. వారి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఇద్దరి కాళ్లు విరిగిపోయాయి. అంబులెన్స్ లో వారిని కనేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. డాక్టర్ మహేంద్ర .. రామాంజనేయులు కాళ్లు తీవ్రంగా గాయపడ్డాయని అతని పరిస్థితి చాలా విషమంగా ఉందని అతని తక్షణమే బళ్ళారికి పెద్ద హాస్పిటల్‌కి తరలించారని, మరొక వ్యక్తి ఎల్లప్ప అనే వ్యక్తి కూడా తీవ్రంగా ఉందని, కనేకల్ ఆసుపత్రిలో అతనికి చికిత్స నిర్వహించారు.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, హైదరాబాద్ ఫోన్: 040-23755686/040-23745686
సవరణ
SARFAESI యాక్ట్, 2002 ప్రకారం అమ్మకం కొరకు కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ తరఫున 31 ఆగస్టు, 2025న ఒక అమ్మకపు నోటీసును ప్రచురించడమైనది. అమ్మకము నోటీసులో తెలిపిన రుణగ్రహీత పేరు మెస్సర్స్ శ్రీ లక్ష్మీకాంత ఇండస్ట్రీస్ లిమిటెడ్. దీనిలో ఆస్తి యొక్క నిర్మాణాత్మక స్వాధీనత తేదీ: 04.07.2019కి బదులుగా 04.12.2019గా చదువుకొనగలరు. సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు/హామీదారులు/ తనఖాదారులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సరైన నిర్మాణాత్మక స్వాధీనతా తేదీ: 04.12.2019గా చదువుకోగలరు.
సం/- అధీకృత అధికారి

వినాయక నిమజ్జనంలో అపశృతి..

- ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సవిత

విశాలాంధ్ర-పరిగి : మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారంరాత్రి వినాయక నిమజ్జంలో ట్రాక్టర్ కిందపడి మారుతి అనే వ్యక్తి మృతి చెందారు.. అదేవిధంగా పలువురు ఈ ఘటనలో గాయపడ్డారు. చికిత్స పొందుతూ మారుతి అనే వ్యక్తి మరణించారు. హిందూపురంలోని ప్రభుత్వం ఆస్పత్రిలో భౌతికకాయానికి మంత్రి సవిత నివాళులు అర్పించారు. అంతక్రియల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర-సోమందేపల్లి : మండల పరిధిలోని బ్రాహ్మణ పల్లి పంచాయతీ మంచేపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ కార్యకర్త గుర్రప్ప అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం చనిపోయారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన నాగభూషనప్ప కుమార్తె చనిపోగా వారింటికి వెళ్లి కుటుంబ సభ్యులను స్థానిక నాయకులు కార్యకర్తలతో కలసి మంత్రి సవిత పరామర్శించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉనికిని చాటుకోవడానికి వైసీపీ డ్రామాలు..

ప్రజలకు న్యాయం చేసేది టీడీపీ : మంత్రి సవిత

విశాలాంధ్ర-సోమందేపల్లి: కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, తమ ఉనికి చాటుకోవడానికి రప్ప రప్ప అంటూ డైలాగులు చెప్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో సోమవారం మంత్రి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు పంణీ చేసి కూటమి ప్రభుత్వం ఎలా ఉంటూ కుశల ప్రశ్నలు వేశారు. ఆంధ్రప్రదేశ్లో ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకెల్తోందని, ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ దారులకు ప్రతినెల 1వ తేదీన ఇళ్ల వద్దకే వెళ్లి 4000 రూపాయలు పెన్షన్ అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడిదే అన్నారు, అనంతరం మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో చంద్రబాబు నాయుడు సక్సెస్ అయ్యారని, మహాశక్తి పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్తో పాటు ఉచిత బస్సు పథకం అమలు చేశారని, తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద విద్యార్థులు తల్లుల ఖాతాలలో జమచేసామన్నారు., అటు పోలవరం పనులు పూర్తిచేస్తూ ఇటు ఆంధ్రప్రదేశ్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు అన్నారు. రానున్న రోజుల్లో కీయా తరహా పరిశ్రమలు మరెన్నో ఆంధ్రప్రదేశ్ కు రానున్నాయని, కృష్ణా జలాలను కుప్పం వరకు తీసుకెళ్లి ప్రతి ఎకరం కృష్ణా జలాలతో తడిచేలా చేసిన ఘనత మా నాయకుడు దక్కుతుందన్నారు, చెయ్యి ఉన్న ఓ వ్యక్తి చేయలేకుండా వీడియో చేస్తూ తన పెన్షన్ పీకేసారంటూ కూటమి ప్రభుత్వం మీద ఆ వాస్తవాలు పోస్ట్ చేశారని, మరుసటి రోజే ఆ వ్యక్తి మద్యం తాగుతూ చిందులేస్తూ వీడియో బయటకి రావడంతో అతని వికలాంగుడు కాదని పోలీసులు గుర్తించారని, ఈ విషయంలో ధర్మవరం పోలీసులను అభినందించాలన్నారు. వైసీపీ పార్టీ ఎన్ని సినిమా డైలాగులు చెప్పిన వినేవారు ఎవరు లేరన్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ లేపాక్షికి రాక ..

విశాలాంధ్ర-హిందూపురం : లేపాక్షికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ వస్తున్నట్లు సిపిఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుండి మూడు రోజులు 2, 3, 4వ తేదీలలో లేపాక్షి పట్టణంలో కర్నూలు ఎడిషన్ పరిధిలోని నాలుగు జిల్లాలు విశాలాంధ్ర ఎడిషన్ పత్రిక విలేకరులు శిక్షణా తరగతులు లేపాక్షి నంది విగ్రహం ఆవరణం ఆర్జేహెచ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే.రామకృష్ణ సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వేమయ్య యాదవ్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. మీడియా మిత్రులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఖచ్చితంగా పార్టీ కార్యవర్గ సభ్యులు, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, సోమందేపల్లి మండల కార్యదర్శులు, సహాయ కార్యదర్శిలు, ముఖ్య నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్గా సాయికృష్ణ

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ ఇన్చార్జిగా ఎం సాయి కృష్ణ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరు ఇదే పురపాలక సంఘం కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతమున్న కమిషనర్ ప్రమోద్కుమార్ పదవీ విరమణ ఆగస్టు 31వ తేదీకి ముగియడంతో వారు ఇన్చార్జి బాధ్యతలను సాయికృష్ణకు అప్పగించారు. తదుపరి అధికారులకు సిబ్బందికి సమావేశమై సమష్టిగా పనిచేసి మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దామని కోరారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కృషి విద్యాలయంలో ఉపాధ్యాయులకు సోమవారం పాటల పోటీలు నిర్వహించామని హెడ్మాస్టర్ కరణ్ స్వరూపాసింగ్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మహిళ ఉపాధ్యాయులకు రంగోలి పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్య బోధనకు పరిమితం కాకుండా వారి మానసిక ఉత్సానికి ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం వల్ల వారికి దోహదపడుతాయని తెలిపారు. వంద మీటర్ల మరుగుపందెం, షాట్పుట్, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తూ గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీన్ భాస్కర్ రెడ్డి, వీఎవో రవీంద్ర, ఏవో రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి పాల్గొన్నారు.

ఘనంగా మన పాఠశాల-మన ఆత్మగౌరవం

విశాలాంధ్ర-ధర్మవరం: రామగిరి, చెన్నై కొత్తపల్లి, ధర్మవరం, కనగానపల్లి మండలాల పాఠశాలల్లో మన పాఠశాల - మన ఆత్మగౌరవం అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు అన్నం అరవింద్ తెలిపారు. ఈ కార్యక్రమం ఏబి ఆర్ఎస్ఎం దేశవ్యాప్తంగా జరుగుతోందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, హర్షవర్ధన్, హర్షవర్ధన్, సత్యనారాయణ, గోవర్ధన్ రామకృష్ణ, చంద్ర, హేమంత్ పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకం భారం కాదు... బాధ్యత

- సూపర్ సిక్స్ హామీలు, మహిళా సాధికారతే సీఎం లక్ష్యం
- ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి: స్త్రీశక్తి పథకం భారం కాదు...బాధ్యతని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్త్రీ శక్తి పథకం విజయోత్సవ కార్యక్రమాన్ని మదనపల్లి రోడ్డులో గల పీవీఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని 332 సంఘాలలోని 3320 మంది సభ్యులకు, 28.23 కోట్ల మెగా చెక్కు,స్త్రీ నిధి ద్వారా 1127 మంది సభ్యులకు9.52 కోట్ల మెగా చెక్కును పంపిణి చేశారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర ఖజానాను దోచుకోవడం, దాచుకోవడ మే ద్యేయంగా పాలన సాగిందన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు కోసం పక్కా ప్రణాళికతో పాలన సాగిస్తుంటే వైసీపీ నాయకులకు కళ్లు, చెవులు ఉన్నా మాకు కనపడలేదు,వినపడ లేద న్నట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామని,రాష్ట్రంలో ఏ మహిళను కదిలించినా సంతోషం కనిపిస్తోందన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఏ రోజైనా ధైర్యంగా ఇలా జనంలోకి వచ్చారా అని నిలదీశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంలో చంద్రబాబు నాయుడు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు.సూపర్ సిక్స్ అని చెప్పి, సూపర్ హిట్ చేసి చూపించామని తెలిపారు.

ఒకేసారి వెయ్యి పెంచి 4 వేల రూపాయలు పెన్షన్, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి 15 వేలు, అన్నదాత సుఖీభవ మొదటి విడతగా 7 వేలు ఇస్తూ, ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తూ,మెగా డీఎస్సీ ద్వారా 16వేల 347 టీచర్ పోస్టులు కూటమి ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. మహిళా సాధికారత, స్వావలంబనకే తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని మహిళలకు అవకాశాలు అద్భుతాలు చేస్తారనే నమ్మకంతో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం ఎస్ పార్థసారథి, జనసేన నాయకులు బైరవ ప్రసాద్, మహిళా నాయకురాలు పర్వీన్ భాను పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టండి

విశాలాంధ్ర-కొత్తచెరువు : బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు వెళ్లే కాలువలను మరమ్మత్తులు పనులు ప్రభుత్వం చేపట్టాలని. మానవ హక్కుల సంఘం నాయకులు ఎంవి పాపన్న సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే గ్రీవెన్స్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్కుమార్కు వినతిపత్రం అందజేశారు. చెరువు కింద ఆయకట్టు భూములు దాదాపు 4 వేల ఎకరాల వరకు ఉన్నదని.. ఏటా హంద్రీనీవా నీటి ద్వారా చెరువులను నింపుతున్నందున. చివరి ఆయకట్టు రైతులకు నీరు అందలేదని ఆందోళన చెందుతున్నారు అన్నారు. పెద్ద కాలువ, చిన్న కాలువ, గోరంట్లపల్లి కాలువ, తిమ్మరసుకుంట కాలువలు, ముళ్ళకంప చెట్లతో ఉండటంతో నీరు ముందుకు రావడం లేదు తక్షణమే వాటి మరమ్మత్తులకు నిధులను మంజూరు చేసి వాటి పనులను చేపట్టాలన్నారు. అలాగే కాలువలను ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకున్న వారిపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కనుల పండుగగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర-బుక్కపట్నం: మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాయకులు సోమవారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఈ నిమజ్జనం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, యువత కేరింతలతో ఉత్సాహంగా సాగింది. గ్రామ పురవీధుల్లో సాగి స్థానిక చెరువులో నిమజ్జనాన్ని పూర్తి చేశారు. కోటవీధిలోని ఉర్దూ స్కూల్ దగ్గర ఏర్పాటుచేసిన బాల గణేష్ వినాయకుని లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు జబీఉల్లా 18 వేల రూపాయలకు సొంతం చేసుకున్నాడు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ కృష్ణమూర్తి గడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి చెరువుకు నీరందివ్వాలి.. వైసీపీ

విశాలాంధ్ర-తనకల్లు : హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలోని ప్రతి చెరువును నీటితో నింపాలని వైసీపీ మండల కన్వీనర్ అశోక్ వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్కు వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సీజన్లో సమయానుకూలంగా వర్షాలు పడకపోవడంతో రైతులు అరకొరగా పంటలు సాగు చేశారని ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు అందివ్వాలన్నారు. ప్రతి గ్రామంలోనూ త్రాగు, సాగు నీరు సమస్య లేకుండా చూసి మండల ప్రజలకు ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు మబ్బు. అశోక్ వర్ధన్రెడ్డి, దేశాయి భక్తవత్సల రెడ్డి, దేశాయిసంజీవరెడ్డి కరే.నరేంద్ర, బిఎస్ నిజాం, హరినాథ్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ ప్రతి ఇంట వెలుగు

విశాలాంధ్ర-అమడగూరు : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ రెండవ సెంటర్ నందు సోమవారం ఆహార మహోత్సవ సంపూర్ణ పోషక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, తాసిల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీవో మునెప్ప, వైద్యాధికారిణి అపర్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గర్భిణి అయిన 3 నెలల నుండి మంచి పోషక ఆహార పదార్థాలు తీసుకుంటూ తమ బిడ్డ శ్రేయస్సు ఉంటుందన్నారు. ఆకుకూరలు విటమిన్స్ పదార్థాలు కల్తీ లేని ఆహారాలు, గర్భిణులు తీసుకోవాలని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేపించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి, ఐసిడిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-కొత్తచెరువు: పేదల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, తెలిపారు. మండలం పరిధిలోని కొడపగానిపల్లి, ఇళ్ల వెంకటం పల్లి, తలమర్ల, బంగారు చిన్న పల్లె, గ్రామాలలో సోమవారం ఉదయం ఆమె పర్యటించి ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఆమెకు గ్రామాలలోని ప్రజలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు కొందరు కావాలనే దురుద్దేశంతో పింఛన్లు తొలగించారని ప్రచారం చేస్తున్నారన్నారు. దేశంలో అత్యధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అన్నారు పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎన్నో సంక్షేమ పథకాలు అందచేస్తున్నారు అన్నారు. అనంతరం కోడపగానిపల్లె పల్లి ఎస్సీ కాలనీకి చెందిన 10 ఏళ్ల దివ్యాంగుడు మోహన్ కృష్ణ అనే బాలుడికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ట్రై సైకిల్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ ,వలిపి శ్రీనివాసులు, షర్ఫుద్దీన్, వెంకట్ రెడ్డి ఎంపీడీవో నటరాజు, కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్సిఆర్ఏ నిధులను వెంటనే మంజూరు చేయాలి

సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన

విశాలాంధ్ర-బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఆర్డిటి హాస్పిటల్ నందు సోమవారం ఉదయం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డిటిని రక్షించుకుందాం, ఆర్డిటిని కాపాడుకుందాం అనే నినాదంతో ఫాదర్ ఘాట్ దగ్గర నుంచి ర్యాలీగా బయలుదేరి బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో 15 నిమిషాల పాటు రాస్తారోకో చేసిన అనంతరం ఎమ్మార్వో స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మహిళ సాధికారత వంటి రంగాలలో ఆర్డీటీ కీలకమైన సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. ఎఫ్సిఆర్ఏ నిధులు నిలిచిపోవడం వల్ల ఆర్డీటీ సంస్థ చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని.. ఇది గ్రామీణ ప్రజలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుంద పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సాకే రామకృష్ణ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి సాకే ఓబ్లేష్, సిపిఐ కార్యవర్గ సభ్యులు మతల నాగభూషణ, గంగాధర్, ఎల్లమ్మ, సాలమ్మ, పుల్లమ్మ, సాకే నారాయణ, రాందాసు, రమీజా, కేశవరెడ్డి, సత్యమయ్య, నత్యప్ప, ప్రభావతి, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-పెనుకొండ : బెంగళూరు నుండి అనంతపురం హైవేలో గుటూరు క్రాస్ దాటిన తర్వాత గుర్తుతెలియని పురుషుని శరీరం చనిపోయే ఉన్నడు. ఇతని పేరు వివరాలు తెలియడం లేదు ఎవరైనా ఆచూకీ తెలిసిన వాళు వెంటనే కియా పోలీస్ స్టేషన్ దగ్గరకు వచ్చి మమ్మల్ని కలవాల్సిందిగా కియా ఎస్ఐ రాజేష్ పత్రికా ప్రకటనలో తెలిపారు. తెలిసిన వారు ఎస్ఐ ఫోన్ నెంబర్ 9346917078కు సమాచారాన్ని అందజేయాలని కోరారు.

సీఎం చంద్రబాబు నాయుడు పాలన దేశానికే ఆదర్శం..

విశాలాంధ్ర- ధర్మవరం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చెరగని ముద్ర వేశారని.. ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. చంద్రబాబు సీఎంగా పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తైన సందర్భంగా శ్రీరామ్ ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకుల సమక్షంలో శ్రీరామ్ కేక్ కట్ చేశారు. కంగ్రాట్స్ సీఎం సర్ అంటూ నాయకులు నినాదాలు చేశారు. ధర్మవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల తరుపున శ్రీరామ్ ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఒక సామాన్య రైతు బిడ్డగా పుట్టి.. విద్యార్థి దశ నుంచే పోరాటాలతో రాజకీయాల్లో ఎదిగిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఒక రోల్ మోడల్గా నిలిచారన్నారు. ఇందుకు ఆయన ముందు చూపు, ఆలోచన పరిజ్ఞానం, రాజకీయ చతురత అభివృద్ధిపై ఆయనకున్న విజన్ కారణం అన్నారు. ఇన్నేళ్ల పాటు పార్టీ సమర్థవంతంగా నడపటంతో పాటు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారంటే రాష్ట్రంలో ఈ ఘనత భవిష్యత్ లో కూడా ఎవరికీ ఉండదన్నారు. ఆరోజు హైటెక్ సిటీ నుంచి నేటి అమరావతి, పీ4 వరకు ఆయన తీసుకున్న నిర్ణయాల్లో ప్రతీదీ సంచలనమేనన్నారు. ఆయన మరో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ముందుకు నడిపించే శక్తిని ఆ భగవంతుడు ఇవ్వాలని ఆకాంక్షించారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన బత్తా మహేష్ (36) స్థానిక చెరువు దగ్గర కాలుజారి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు పట్టణంలో వినాయక నిమజ్జన ఉత్సవాలు జరుగుతున్న సమయంలో, మహేష్ కూడా చెరువు కట్ట వద్దకు వెళ్లాడు. నిమజ్జనం తర్వాత ముఖానికి వేసుకున్న రంగులను కడుక్కోవడానికి చెరువు వద్దకు వెళ్లాడు పొరపాటున కాళ్లు చేతులు కడుక్కుంటూ ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి బురదలో ఇరుక్కొని మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతునికి ఒక కుమారుడు కూడా కలడు అని తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE DHARMAVARAM

I.P.NO: 21/2024

Between:

D.MAHABOOB BASHA ...*Petitioner*

And

1.S.BABAFAKRUDDIN 2. TEJA

... *Respondants*

Notice to the Respondant No: 2

R2 : Teja s/o not know, D.no 17/342, near chakravarthi theater, Dharmavaram, Sri Sathya sai District..

పై నెంబరు కేసులో 2వ Respondant అయిన మీ హాజరు నిమిత్తము 10-09-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏవైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By Order of the Court)

D.Abdul sab,
Advocates, Dharmavaram.
Cell no 9849702418

ఏ రంగంలోనైనా రాణించే శక్తి మహిళలకు ఉంది : ఎమ్మెల్యే సింధూరరెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఏ రంగంలోనైనా రాణించే శక్తి సామర్థ్యాలు మహిళలకే ఉన్నాయని ప్రతి మహిళ ఆర్థికవేత్త కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గణేష్ సర్కిల్ మీదుగా అబ్దుల్ కలాం షాదీ మహల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింధూరరెడ్డితో పాటు మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఆర్డీవో సువర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయి అన్నారు. మహిళలను ఆర్థికవేత్తలుగా మార్చాలని ఉద్దేశంతో వెలుగు సంఘాల ద్వారా మహిళా సంఘాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా అభ్యున్నతికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారన్నారు. పొదుపు చేసే శక్తి మహిళలకు మాత్రమే ఉందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్టుగా మారాయన్నారు. ఇందులో భాగంగానే స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ ద్వారా 193 చెరువులకు నీరు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి మాట్లాడుతూ మహిళలతోనే దేశ ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ఆడబిడ్డకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత దివంగత నేత ఎన్టీఆర్కే దక్కిందని వెల్లడించారు.

అనుబంధ కమిటీలతో టీడీపీ బలోపేతం..

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలోని ఏఎంఎస్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు వద్దే అంజనప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు, జిల్లా పార్టీ అధ్యక్షులు మున్సిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అనుబంధ కమిటీల ఎంతగానో తోడ్పడుతాయన్నారు. పార్టీ సిద్ధాంతాల ప్రకారం పట్టణ ముఖ్యమైన కమిటీతో పాటు తెలుగు యువత తెలుగు మహిళ టిఎన్టియుసి, మైనార్టీ సెల్ బిసి, ఎస్సీ, ఎస్టీ సెల్ వంటి అనుబంధ కమిటీల్లో సరైన వ్యక్తులను అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాలు కల్పిస్తామన్నారు. ఆయా కమిటీలు అన్ని వార్డులో క్షేత్రస్థాయిలో పార్టీని అభివృద్ధి చేయాలన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడిన వారిని కచ్చితంగా ఎమ్మెల్యే బాలకృష్ణ, గుర్తించి వారికి అన్ని అనుబంధ కమిటీల్లో సామాజిక సమీకరణతో సముచితమైన స్థానాన్ని ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగరాజు, జేబీకే. రాము, రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, ఇర్షాద్ అహ్మద్, సునీతమ్మ, నాగమణి, రహమత్ బి.ఆయుబ్, నెట్టప్ప, భాస్కర్, అమర్నాథ్, డైమండ్ బాబా, ప్రియా, గంగాధర్, మంగేష్, దుర్గా నవీన్, హరీష్ కుమార్, నాగేంద్ర, అబ్బుతుల్లా, ఇందాద్, వెంకటలక్ష్మి, చెన్నమ్మ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి నిత్యావసర సరుకుల పంపిణీ..

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని వెంకట తిమ్మాపురం గ్రామానికి చెందిన నారాయణ 3 సంవత్సరాల నుంచి పక్షవాతం వారి కుమారుడు రాజుకి కిడ్నీ ప్రాబ్లం వల్ల ఆర్థిక పరిస్థితి బాగాలేదని సోషల్ మీడియా ద్వారా తెలిసిన వెంటనే రక్త బంధం ట్రస్టు రజిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణ వాసులు బండారు సూర్యనారాయణ ఆర్థిక సహకారంతో ఒక నెలకు సరిపడే సరుకులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేతా లోకేష్ మాట్లాడుతూ ఈరోజు నారాయణ, రాజు, వారి కుటుంబ పరిస్థితి చూసి చాలా బాధగా అనిపించింది సమాజ శ్రేయస్ కోసం మా మిత్రులు బండారు సూర్యనారాయణ తన వంతు గా సహకారం సరుకులు సహాయం గా అందించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. కన్నా వెంకటేష్, మాట్లాడుతూ నారాయణ, రాజు, వారి కుటుంబ పరిస్థితి చాలా బాధ కలిగించింది ఇంకా ఎవరైనా దాతలు దయచూపి వారి కుటుంబానికి సహకారాలు అందించాలని తెలియజేశారు భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్ని విధాలుగా మా వంతు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సమాజ సేవకులు కేతా లోకేష్, చిప్పల చంద్రశేఖర్, హేమలత, శ్రీలత, కన్నా వెంకటేష్, లక్ష్మణ్, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 2, సెప్టెంబరు 2025

వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి జయప్రదం చేయండి...

వైసీపీ కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్

విశాలాంధ్ర - అగళి : స్థానిక వైయస్సార్ విగ్రహం ముందు మంగళవారం ఉదయం 11 గంటలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మండల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గం సమన్వయకర్త ఎస్ఎల్ ఈరలకప్ప వస్తున్నారని కావున మండలంలోని రాష్ట్రస్థాయి విభాగం నాయకులు, వైస్ ఎంపీపీలు సర్పంచులు ఎంపీటీసీలు నియోజకవర్గ అనుబంధ విభాగం అధ్యక్షులు పంచాయతీ కన్వీనర్లు పంచాయతీల ఇన్చార్జీలు మండలంలోని మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు మాజీ డీలర్లు మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు మండలంలోని యువకులు వైసీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ మైనార్టీ నాయకుడికి మంత్రి నివాళి

విశాలాంధ్ర–పెనుకొండ: పెనుకొండ పట్టణానికి చెందిన మహబూబ్ బాషా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం చనిపోయారు. మంత్రి సవిత వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆమె వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర–శింగనమల : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను ఏ షరతులు లేకుండా అమలు చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల పింఛన్లు అనేక షరతులు పెట్టి తొలగించారని వాటిని తక్షణమే పునరుద్ధరించాలని తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందించారు. 40శాతం ఉన్న ప్రతి వికలాంగులకు 6000 ఇస్తామని ఇప్పుడు తీసివేయడం సరైంది కాదని, రైతుకు పెట్టుబడి సాయం అందించాలని, ఈ కేవైసీ పేరుతో చాలామంది రైతులు కి నష్టం జరిగిందని, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ప్రతి ఒక్కరికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ఇంటర్ సెకండియర్ చదివిన విద్యార్థులకు అందలేదని, స్త్రీశక్తి పేరు మీద రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులలో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తామని, కొన్ని బస్సులకే పరిమితం చేశారు, అన్ని బస్సుల్లో అనుమతి ఇవ్వాలని, అర్హులైన నిరుపేదలకుఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రంగయ్య శ్రీరాములు, శర్మ స్వలి, లక్ష్మి రంగయ్య, శ్రీరాములు, సూరి, భాషా, స్వరనాగప్ప, ఆదినారాయణ, రాముపాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర–పెనుకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం కామర్స్–1, గణిత శాస్త్రం–1, వృక్షశాస్త్రం–1, చరిత్ర–1సబ్జెక్టులలో బోధించుటకు అతిథి అధ్యాపకు ల దరఖాస్తులు ఈ నెల 6 వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని కళాశాల ప్రిన్సిపల్ డా. కేశవరావు వైస్ ప్రిన్సిపల్ డా.కే జయప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. వీరికి ఈనెల 8వ తేదీ కళాశాలలో మౌఖిక పరీక్షలు నిర్వహించ బడును. సంబంధిత సబ్జెక్టు లో పోస్టు గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. జాతీయ అర్హత పరీక్ష నెట్లో ఉత్తీర్ణత, రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష సెట్, పీహెచ్డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

టీడీపీ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర–పెనుకొండ: చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎం అయ్యి నేటికి 30 ఏళ్లు పూర్తి కావడంతో సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి రాష్ట్ర మంత్రి సవిత సంబరాల్లో పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

స్మశాన వాటికలో కంప చెట్లు తొలగించండి

విశాలాంధ్ర–ఉరవకొండ: పట్టణంలో హిందూ స్మశాన వాటికలో విపరీతంగా పెరిగిన కంప చెట్లను తక్షణమే తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ చేయాలని ఎస్సీ ఎస్టీ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కౌకుంట్ల రవి, వార్డ్ సభ్యులు రామాంజనేయులు, చేజాల ప్రభాకర్ ఉరవకొండ గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం వారు కార్యదర్శని కలిసి హిందూ స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. హిందువులకు అతి పెద్ద పండగ విజయదశమిని ఆరోజు మృతిచెందిన వారిని స్మరించుకొని పూజలు చేస్తారని సమాధుల వద్దకు కూడా వెళ్లేందుకు రహదారి లేక కంప చెట్లు మూసుకుపోయాయని వారు తెలిపారు. తక్షణమే స్మశానవాటికను శుభ్రపరచాలన్నారు.

పాల కేంద్రం ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర–నంబులపూలకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ పాల కేంద్రం ఏర్పాటు చేసి మండలంలోని పాడి రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నాగిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ప్రయివేటు పాల కేంద్రాలు పాడి రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకు పాలు కొనుగోలు చేస్తున్నారని,ప్రభుత్వ పాల డిపో ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగదాయకంగా ఉంటుందన్నారు. అలాగే గతంలో సోలార్ నిర్మాణం చేపట్టేటప్పుడు పాడి పశువుల మేత కోసం 500 ఎకరాలు కేటాయిస్తామని అప్పటి అధికారులు పేర్కొన్నప్పటికీ ఆ భూమిని ఇంతవరకు కేటాయించ లేదని, 13 సంవత్సరాలు గడుస్తున్నా మేత కోసం భూమిని కేటాయించ కుండా పశువుల పోషణ ఆధారంగా జీవిస్తున్న రైతులను వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు మోసం చేశారని పేర్కొన్నారు. పాల కేంద్రం ఏర్పాటు చేయాలని, పశువుల మేత కోసం 500 ఎకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, చిన్న మల్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మి మోసపోయింది చాలు..

విశాలాంధ్ర–పెనుకొండ : మండల పరిధిలోని ఆడదాకులపల్లి గ్రామంలో సోమవారం గ్రామంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపగడపకు వెళ్లి "ప్రతి ఒక్కరినీ పలుకరించి.. నాడు జగనన్న చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ గుర్తు చేశారు. కూటమి ప్రతి ఒక్కరినీ నమ్మించి మోసం చేసిందన్నారు. ఇలాంటి చంద్రబాబుని నమ్మి మీరు ఎంత మోసపోయారో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇలాంటి కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మోసపోవద్దని తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు...

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు కలెక్టర్ డా. వినోద్ కుమార్

విశాలాంధ్ర–అనంతపురం: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించే అర్జీలపై నిర్లక్ష్యం తగదని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని, ఈపీటిఎస్, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల డేటా అప్లోడ్ త్వరితగతిన చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి హెచ్చరించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ లతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అంతకుముందు వివిధ అంశాలపై జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణితో జిల్లా కేంద్రా నికి అర్జీదారులు వస్తున్నారని అన్నారు. అలాగే తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎక్కువగా మండల స్థాయి అధికారులు గైర్హాజరు అవుతున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇకపై ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చాలా వరకు సమస్యలు మండల స్థాయి నుండే వస్తున్నాయని, అందువలన అక్కడే పరిష్కార మార్గాలు చూపి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు వారితో గౌరవంగా మాట్లాడి అర్జీలకు సంబంధించి ఖచ్చితంగా రసీదులు అందజేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులందరూ తప్పనిసరిగా ప్రతి సోమవారం పాల్గొనాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరిం చారు.

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

విశాలాంధ్ర–పుట్టపర్తి : జిల్లా కేంద్రానికి ఎంతోమంది తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో వచ్చే అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్య నారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 174 అర్జీలను స్వీకరించారు. అనంతరం జేసి మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్మిత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ పెట్టకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరి, ఇంటి స్థలం మంజూరు, పెన్షన్ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతి పత్రాలు సమర్పించారన్నారు. ఈ సమస్యలన్నీ ఎక్కువగా రెవిన్యూ వారి పరిధిలోనే ఉన్నాయన్నారు. ఆయా తహసిల్దారులు, సంబంధిత అధికారులు వీటిని చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు.

కూచిపూడి నాట్యంలో చిన్నారి శరణ్య ప్రతిభ

విశాలాంధ్ర–పామిడి: పామిడి గ్రామపంచాయతీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణ కూతురు హరి శరణ్య, కూచిపూడి నాట్యం చేసి పతిభ కనబర్చారు. కాణిపాక బ్రహ్మోత్సవాలో భాగంగా అరవింద్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పామిడి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పర్నిత, నీహాస్వి, శ్రీ స్నిగ్ధ రాయల్, సహస్ర, నాగ సాన్విక,సాయి వర్ష, దివ్యశ్రీ, షణ్ముఖ, ప్రియా, కూచిపూడి నృత్య సురేష్ మాస్టర్ నేతృత్వంలో నాట్యం నేర్చుకొని కాణిపాకంలో నిర్వహించిన కూచిపుడి నాట్యంలో ప్రతిభ కనబర్చారు. నిర్వాహకులు మెమోంటోతో ఘనంగా సత్కరించారు. కూచిపుడి నాట్యంలో సాధన చేసి చిన్నప్పటి నుంచే ప్రతిభ చూపిస్తున్న చిన్నారి పామిడి గ్రామ ప్రజలు అభినందించారు.

సామాజిక సేవకులకు ఘన సత్కారం..

విశాలాంధ్ర–యాడికి : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్య ఆరోగ్య సామాజిక సేవ కార్యక్రమాలలో సేవలందిస్తున్న సామాజిక సేవకులకు రాయల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అమెరికా దేశంలో స్థిరపడిన ఎన్నారై పసల శ్రీధర్ వారి సేవలను గుర్తించి సోమవారం ఘనంగా సత్కరించారు. ఫిజికల్ డైరెక్టర్ సంజీవరాయుడు సన్మానిస్తూ 10 వేల రూపాయలు చెక్కును అందజేశారు. యోగ శిక్షకుడు అయిన గరిడి శివన్న మే ఐ హెల్ప్ యూ ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ, ధ్రువ నారాయణ, కోన రోడ్ తో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న వెంకట రాముడు, గతంలో చందన హై స్కూల్ పనిచేసిన సంజీవరాయుడు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతా రామాంజనేయులు ఎంఈఓ కాశప్ప రాయల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, శశిధర్, ఆనంద్, బండారు బాల ఉపాధ్యాయులు శ్రీనివాసుల యాదవ్ రవికుమార్ నాగన్న మంజులవాణి శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం..

విశాలాంధ్ర–ధర్మవరం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో (వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట) ఈనెల రెండవ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జూటూరు వెంకి, బీసీ మల్లన్న, మిత్రబృందం వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

4న ఉచిత ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం..

విశాలాంధ్ర–పుట్టపర్తి : సత్యసాయి పూర్వపు విద్యార్థులు నడిపించే సాయి నగర్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఈనెల 4న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాలకు పైబడిన మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయబడుతుం దన్నారు. ముందుగా శిబిరానికి వచ్చే మహిళలు తమ పేరును 08047103700 కు ఫోన్‌చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ చికిత్స ద్వారా స్థానిక మహిళలకు క్యాన్సర్ భారాన్ని తగ్గించడమే తమ ప్రయత్నమన్నారు. ఇప్పటికే పుట్టపర్తి పరిసర ప్రాంతాలలోని 750 మంది క్యాన్సర్‌తో దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారికి ఈ కేంద్రం ఉచితంగా సేవలు అందిస్తోందన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర–కణేకల్లు: కణేకల్ గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి తెలుగుదేశం నాయకులు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఆనంద రాజులు మాట్లాడుతూ దేశంలోనే పింఛన్ల సంక్షేమ పథకానికి ఆద్యులు టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అన్నారు. పింఛన్లను రూ.200 నుంచి రూ.2000 కు, రూ.3000 నుండి రూ.4000కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగ పెన్షన్లు పొందారని, అలాంటి పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వెరిఫికేషన్లో అర్హులకు కూడా నోటీసులు రావడం బాధాకరమని, ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అర్హులైన ఏ ఒక్కరికి అన్యాయం జరగరాదని ఆదేశించారన్నారు. అర్హులైన అందరికీ దివ్యాంగ పింఛన్ అందేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లాలెప్ప, ఆనంద్ రాజులు, చాంద్ బాషా,అనిల్ ఇంకా కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో టీడీపీ నాయకులు

విశాలాంధ్ర–గుడిబండ : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభించారు.ఈ సందర్భంగా కె.కె.పాళ్యం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, జంబులబండ గ్రామంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తిలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం గ్రామపంచాయతీ సిబ్బంది ఉదయం 6గంటలకు పింఛన్ లబ్ధదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేశారు.ఈ క్రమంలో సింగల్ విండో డైరెక్టర్ ప్రకాష్, బూదిపల్లి జయరామప్ప, టిడిపి నాయకులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి..

విశాలాంధ్ర–నార్పల : స్థానిక సుల్తాన్ పేట 1 అంగన్వాడి పరిధిలో పౌష్టికాహార వారోత్సవాలు సిపిడిఓ ఆదేశాల మేరకు నిర్వహించారు. సమతుల ఆహారం తీసుకోవాలని పౌష్టికాహారం లోపం వల్ల వచ్చే వ్యాధులు, రక్తహీనత, గురించి తల్లులకు వివరించారు. అలాగే ఆకుకూరలు, కాయకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచన లిచ్చారు. ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాలు గురించి, 6 నెలలు పాటు తప్పకుండా తల్లి పాలు మాత్రమే ఇవ్వడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ డి యస్.నారాయణమ్మ, ఆరోగ్య సిబ్బంది ఆకులప్ప పాల్గొనారు.

మాజీ ఎంపీ తలారి రంగయ్యను కలిసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర–కణేకల్లు : మండల పరిధిలోని మాల్యం గ్రామంలో వైసీపీ నాయకులు మాజీ ఎంపీ తలారి రంగయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి తో పాటు గ్రామం వైసిపి నాయకులు అందరూ మంగళవారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని.. వైసీపీ బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యల గురించి పలు అంశాలను అందరి దగ్గర కొద్దిసేపు సంభాషించారు.

నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించండి..

విశాలాంధ్ర–పుట్టపర్తి: నల్లమాడ మండలంలోని గోపేపల్లి తండాలో నీటి ఎద్దడి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తండాలో నెలకు ఒకసారి విద్యుత్ డీపీ కాలిపోతోందని, దీంతో గ్రామంలో ఉన్న తాగునీటి పంపు మోటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. ఒక్కొక్కసారి నెలలో రెండుసార్లు కూడా ట్రాన్సుఫార్మర్ కాలిపోతున్నదని ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు, మొరపెట్టుకున్న తమ గోడు పట్టించుకోలేదన్నారు. గ్రామంలో గత 20 రోజుల నుంచి నీరు తాగడానికి కూడా లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామన్నారు. గ్రామ విద్యుత్ లైన్‌మెన్‌కు సమస్యపై ఎన్నిసార్లు తెలిపిన పై అధికారులకు తెలపాలని మాట దాటవేస్తున్నాడన్నారు .గ్రామంలో నెలకొన్న సమస్యపై సర్పంచ్ రూ.40 వేల వరకు నిధులు ఖర్చు చేశారని అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించి గ్రామానికి తాగునీరు అందించాలని కోరారు.

ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా రూ.25 వేలు చెల్లించాలి

విశాలాంధ్ర–ముదిగుబ్బ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినస్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన ద్వారా ఆటో కార్మికులు కుటుంబాలు ఉపాధి కోల్పోయి, ఆటోలపై తెచ్చిన రుణాలను కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ ఆఫీసు నుంచి ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ ఆఫీస్ ముందర ధర్నా కార్యక్రమం చేపట్టారు, తహసీల్దార్ నారాయణ స్వామికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆటో పెద్దన్న మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల పట్ల వాహన మిత్ర ద్వారా 25000 రూపాయలను వెంటనే చెల్లించాలని, అలాగే 21వ జీవోను రద్దు చేయాలని,హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు,ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, సెక్బావలి, బాబావలి, బాబాపకర్దిన్, ఫక్రుద్దీన్, టైలర్ ముత్తు,డాక్టర్ బాబు, అల్లా బక్షు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

విశాలాంధ్ర–గుంతకల్లు: సీఎం చంద్రబాబు నాయుడు అవ్వ తాతలకు ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి వృద్ధులకు పింఛన్ అందజేస్తున్నాడని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఈ సందర్భంగా పట్టణం పాత గుంతకల్లు నందు గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ముఖ్య అతిథులుగా హాజరై ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందినీ ఎంతోమంది వృద్ధులకు ఇంటి పెద్ద కొడుకుగా ఉండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారికి అండగా నిలుస్తూ ఏకంగా రూ.6 వేల పెన్షన్ అందిస్తున్నారని.. ఇటీవల వైసీపీ నాయకులు అర్హత కలిగిన వికలాంగులకు వృద్ధులకు పెన్షన్లు తీసేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన సంగతి అందరికీ తెలిసిందే అని అన్నారు.కానీ అర్హత ఉన్న ఏ ఒక్కరికి పెన్షన్ రద్దు అవ్వకుండా ఈనెల అందించిన ఘనత మన కూటమి ప్రభుత్వానిది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదిని ఈ సందర్భంగా ఎమ్మెల్యేఅన్నారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ హిమబిందు, తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుజిరి కాజా,గుంతకల్లు పట్టణ వార్డ్ కౌన్సిలర్లు, మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.